సాక్షి కామారెడ్డి

ఆదివారం । 22 । డిసెంబర్ । 2024



కొనసాగుతున్న సమ్మె

డిమాండ్ల సాధన కోసం సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజూ కొనసాగింది.

- 8లో ▸



సాగుకు భరోసా

నిజాంసాగర్ ఆయకట్టు కింద సాగుకు భరోసా లభించింది. ప్రాజెక్టు నీరందుతుండడంతో సాగు పనులు జోరందుకున్నాయి.

- 9లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
30.6 /17.3

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత తగ్గే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

కొనసాగుతున్న విచారణ



పెద్దకొడప్‌గల్: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహం విద్యార్థులు ఉడికీఉడకని అన్నం తిని తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటనపై విచారణ కొనసాగుతోంది. జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి రజిత, ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత శనివారం రెండోరోజూ హాస్టల్‌ను సందర్శించి, విచారణ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ దశరథ్, ఇన్‌చార్జి ఏఎస్‌డబ్ల్యూ వెంకటేశ్, మండల వైద్యాధికారి ఉమాకాంత్ పాల్గొన్నారు.

జిల్లా కోర్టు వెబ్‌సైట్‌లో పరీక్ష ఫలితాలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి కోర్టులో ఖాళీగా ఉన్న సిబ్బంది పోస్టులను భర్తీ చేయడం కోసం శనివారం జిల్లా కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్ స్కూల్‌లో పరీక్ష నిర్వహించారు. స్టెనో టైపిస్ట్ పరీక్షకు 14 మంది, టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ పోస్టుకు 42, రికార్డు అసిస్టెంట్ పరీక్షకు 78 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్ష ఫలితాలను https://kamareddy.dcourts.gov.in వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా న్యాయమూర్తి వరప్రసాద్ తెలిపారు. ఎంపికైనవారు ఈనెల 28వ తేదీన నిర్వహించే స్కిల్ టెస్ట్, సర్టిఫికెట్ వెరిఫికేషన్, మౌఖిక ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఓ ప్రకటనలో సూచించారు.

'ధ్యానంతో ఒత్తిడి దూరం'



కామారెడ్డి అర్బన్ : యోగా, ధ్యానంతో ఒత్తిడి లేని సంతోషకరమైన జీవితం గడపవచ్చని డీఆర్డీవో సురేందర్ పేర్కొన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా శనివారం జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజు కనీసం 15 నిమిషాలు ధ్యానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ కోటేశ్వర్లు, జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి, యోగాచార్యులు గరిపల్లి అంజయ్య గుప్తా, అంతిరెడ్డి, పి.అంజయ్య, ప్రతినిధులు అనిల్‌రెడ్డి, రమేష్, గంగప్రసాద్, హిమబిందు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



కామారెడ్డి క్రైం: జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఉద్యోగులు రక్తదానం చేశారు. శిబిరంలో 60 యూనిట్ల రక్తం సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఆరు నెలలకోసారి రక్తదానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఏవో తిరుమల ప్రసాద్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ రాజన్న, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

రేపు జాబ్ మేళా



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని పీజీఆర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాలలో సోమవారం తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని కళాశాల చైర్మన్ గురువేందర్‌రెడ్డి తెలిపారు. హెటిరో డ్రగ్స్ కంపెనీలో 300లకుపైగా ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించే ఈ జాబ్‌మేళాకు డిగ్రీలో ఏ గ్రూప్‌లోనైనా ఉత్తీర్ణులైన వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, డైరెక్టర్ గోపాల్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, ప్రోగ్రాం అధికారి మహేష్ పాల్గొన్నారు.

లెక్కలంటే భయమేల?

సండే స్పెషల్



ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో బోధనోపకరణాలు



రెడ్డిపేట హైస్కూల్‌లో..



ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో మ్యాథ్స్ డే సందర్భంగా వేసిన ముగ్గు

గణితం అంటేనే సహజంగా విద్యార్థులలో ఒక రకమైన భయం ఉంటుంది. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చాలామంది లెక్కలు మాకు రావన్న భావనతో ఉంటారు. ఉపాధ్యాయుల కొరత, సరైన ప్రోత్సాహం లేక చాలామంది మ్యాథ్స్‌లో కొంత వెనకబడి పోతున్నారు. అయితే కొందరు మ్యాథ్స్ టీచర్లు ఈ భావనను పోగొడుతున్నారు. గణితం అంటే బ్రహ్మపదార్థం కాదని, ఆడుతూపాడుతూ సులభంగా నేర్చుకోవచ్చని నిరూపిస్తున్నారు. రకరకాల బోధనోపకరణాలు తయారు చేసి, విద్యార్థులకు వాటి ద్వారా బోధిస్తూ, ప్రయోగాలు చేయిస్తూ లెక్కల్లో తీర్చిదిద్దుతున్నారు. దీంతో జిల్లా, రాష్ట్ర స్థాయిలలో మ్యాథ్స్‌కు సంబంధించి ఏ పరీక్ష అయినా, వైజ్ఞానిక ప్రదర్శనలో అయినా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ చూపుతున్నారు. ఆదివారం నేషనల్ మ్యాథమెటిక్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం.. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

- మ్యాథ్స్‌తో మ్యాజిక్ చేస్తున్న టీచర్లు
- విద్యార్థులలో ఆసక్తి రేకెత్తించేలా బోధన
- నేడు నేషనల్ మ్యాథమెటిక్స్ డే

మ్యాథ్స్ మనోహరుడు



రామారెడ్డి మండలం రెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో లెక్కల మాస్టారుగా పనిచేస్తున్న డి.మనోహర్‌ను మ్యాథ్స్ మనోహర్ అంటారు. నిరంతరం అధ్యయనం చేస్తూ, విద్యార్థులను ఆకట్టుకునేలా కొత్తకొత్త ఆలోచనలతో పాఠాలు బోధించడంలో ఆయనకు ఆయనే సాటి అని గుర్తింపు పొందారు. ఏటా విద్యార్థులతో యాభైకిపైగా కార్యక్రమాలు చేయిస్తుంటారు. ఆయన ఎక్కడ పనిచేసినా ఆ పాఠశాల విద్యార్థులు మ్యాథ్స్‌లో రాణిస్తారు. స్టేట్ లెవల్ ఇన్‌స్పైర్‌కు, అలాగే అనేక సైన్స్‌ఫేర్‌లలో ఆయన పాల్గొనడంతో పాటు విద్యార్థులను తీసుకువెళ్లారు. 2017 లో రాష్ట్ర స్థాయిలో బెస్ట్ టీచర్ అవార్డును అందుకున్నారు. ప్రస్తుతం నడుస్తున్న ఎనిమిదో తరగతి, తొమ్మిదో తరగతి పాఠ్యపుస్తకాల తయారీలో ఆయన భాగస్వామ్యం ఉంది.

సులభ పద్ధతుల్లో బోధిస్తున్న నివేదిత




తాడ్వాయి మండలం కృష్ణాజీవాడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తున్న నివేదిత విద్యార్థులకు సులభ పద్ధతుల్లో బోధిస్తూ వారు గణితంలో రాణించేలా తీర్చిదిద్దుతున్నారు. ఏటా మండల, జిల్లా స్థాయిలలో నిర్వహించే మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లకు తాను పనిచేసే పాఠశాల విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. వివిధ అంశాలపై వారికి అవగాహన కల్పించి తర్ఫీదు ఇచ్చి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ చూపేలా వారిని ప్రోత్సహిస్తున్నారు. సులభతర బోధన ద్వారా విద్యార్థుల్లో మ్యాథ్స్‌పై ఉన్న భయాన్ని పోగొట్టి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న నివేదిత అధికారుల మన్ననలు పొందారు.

విభిన్నంగా పాఠాలు చెప్పే విద్యారమణ



ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేస్తున్న ఎనిశెట్టి విద్యారమణ బోధనలో విభిన్న పద్ధతులు అవలంబిస్తారు. విద్యార్థులు మ్యాథ్స్‌పై పట్టు సాధించేలా ప్రయత్నిస్తుంటారు. మొన్నటి వరకు సదాశివనగర్ మోడల్ స్కూల్‌లో పనిచేసి ఇటీవలే ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌కు బదిలీపై వచ్చారు. విద్యార్థులకు కాన్సెప్ట్ అర్థమైతే చాలు.. గణితంపై సులువుగా పట్టు వస్తుందని ఆమె పేర్కొంటారు. ఫార్ములాను ఎలా వాడాలో తెలిసేలా చేస్తూ విద్యార్థులు గణితంలో రాణించేలా చూస్తున్నారు. స్కూల్ స్థాయిలో ప్రాజెక్టులు చేయించడం ద్వారా విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందిస్తున్నారు. తద్వారా విద్యార్థులకు మ్యాథ్స్ అంటే భయం పోయి ఇష్టంగా చదవగలుగుతున్నారు.

అర్థమయ్యేలా వెంకట్ బోధన



కామారెడ్డి పట్టణంలోని ఎస్సీ వాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉప్పు వెంకట్ విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతుల్లో బోధిస్తూ వారికి మ్యాథ్స్ అంటే ఉన్న భయాన్ని పొగొట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఆటపాటలతో అర్థమయ్యేలా పాఠాలు బోధిస్తారు. దీంతో విద్యార్థులు ఎలాంటి టెన్షన్‌కు గురికాకుండా నేర్చుకోగలుగుతున్నారు. టీఎల్ఎం తయారు చేసుకుని వాటి ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.

సాధన చేయిస్తూ తీర్చిదిద్దుతున్న ప్రవీణ్



బీబీపేట మండలం జనగామ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ చాలా కాలం పాటు ఇదే మండలంలోని మాందాపూర్ ఉన్నత పాఠశాలలో పనిచేశారు. ఇటీవలే జనగామకు బదిలీపై వచ్చారు. మాందాపూర్‌లో పనిచేసిన కాలంలో.. ఆ పాఠశాల విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ట్రిపుల్ ఐటీకి ఎంపిక కావడంలో ప్రవీణ్‌కుమార్ పాత్ర ఎంతో ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటారు. పిల్లలకు బోర్ రాకుండా, వారికి అర్థమయ్యే రీతిలో త్రీ ఆర్ పద్ధతులను అవలంబిస్తూ పాఠాలు బోధిస్తారు. విద్యార్థులు ప్రవీణ్ సార్ క్లాస్ కోసం ఎదురుచూస్తుంటారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఎక్కువ సాధన చేయించడం ద్వారా విద్యార్థులను గణితంలో తీర్చిదిద్దుతున్నారు.

రాష్ట్ర స్థాయి సెమినార్‌లో శ్రీనివాస్



కామారెడ్డి రూరల్: హైదరాబాద్‌లోని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) లో శనివారం రాష్ట్ర స్థాయి గణిత సెమినార్ జరిగింది. ఇందులో క్యాసంపల్లి ఉన్నత పాఠశాలలో పనిచేసే గణిత ఉపాధ్యాయుడు తాడ్వాయి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఆయన పాలిండ్రోమ్ నంబర్స్ అన్న అంశంపై ప్రసంగించి అధికారుల మన్ననలు పొందారు. తెలంగాణ గణిత ఫోరం జిల్లా బాధ్యుడిగా జిల్లాలో మ్యాథ్స్ టీచర్లను సమీకరించి ఏటా టాలెంట్ టెస్ట్‌లు నిర్వహించడంలో శ్రీనివాస్ ముందువరుసలో నిలుస్తున్నారు. ఆయన ఇప్పటికే రెండుసార్లు రాష్ట్ర స్థాయి సెమినార్‌లలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలోనూ సత్తా చాటాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ముగిసిన జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం : జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన క్రీడాకారులు సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ సత్తా చాటాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. సీఎం కప్ జిల్లా స్థాయి క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం శనివారం కలెక్టరేట్‌లో జరిగింది. విజేతలకు మెడల్స్, ప్రశంస పత్రాలను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 7, 8 తేదీల్లో గ్రామ పంచాయతీ, 10 నుంచి 12 తేదీల్లో మండల, మున్సిపల్ స్థాయి, 16 నుంచి 21 వరకు జిల్లా స్థాయిలలో పోటీలు నిర్వహించామన్నారు. 8 వేల మంది క్రీడాకారులు ఈ పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. వివిధ క్రీడాంశాలలో వెయ్యి మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, జిల్లా యువజన క్రీడల అధికారి జగన్నాథ్, అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ హరిలాల్, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేత జట్లు..

ఖోఖో బాలుర విభాగంలో మద్నూర్, ఎల్లారెడ్డి జట్లు సంయుక్త విజేతలుగా నిలిచాయి. భిక్కనూరు మండలం మూడో స్థానం దక్కించుకుంది. బాలికల విభాగంలో రామారెడ్డి, పాల్వంచ, బిచ్కుంద మండలాలు వరుసగా మూడు స్థానాల్లో నిలిచాయి. కబడ్డీ బాలుర విభాగంలో పిట్లం మొదటి స్థానంలో, తాడ్వాయి, రామారెడ్డి మండలాలు రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి. బాలికల విభాగంలో బీబీపేట్ మొదటి, పాల్వంచ ద్వితీయ, భిక్కనూరు తృతీయ స్థానాలు దక్కించుకున్నాయి. వాలీబాల్ బాలుర విభాగంలో తాడ్వాయి మొదటి, నాగిరెడ్డిపేట్ ద్వితీయ, బీర్కూర్ తృతీయ స్థానాలు సాధించాయి. బాలికల విభాగంలో నస్రుల్లాబాద్ మొదటి, ఎల్లారెడ్డి అర్బన్ ద్వితీయ, తాడ్వాయి జట్టు తృతీయ స్థానాన్ని పొందాయి.



కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గేటు వద్ద ఏర్పాటు చేసిన 'సాక్షి' ఇంటర్వ్యూ క్లిప్పింగ్ ఫ్లెక్సీ

ఈ అక్షరమే 'సాక్షి'..

కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని పేర్కొన్నారు. తానిచ్చిన వాగ్దానాలను అమలు చేసి తీరుతానని, పార్టీ మార్పు అనేది తప్పుడు ప్రచారమని కొట్టిపారేశారు. ఆ వివరాలతో 'సాక్షి'లో ప్రచురించిన ఇంటర్వ్యూకు సంబంధించిన క్లిప్పింగ్‌ను ఆయన అనుచరులు భారీ ఫ్లెక్సీ తయారు చేయించి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. కార్యాలయానికి వచ్చేవారందరూ ఈ ఫ్లెక్సీని ఆసక్తిగా చూస్తున్నారు.

–సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

బల్దియాలో ఇంటి దొంగలు

మాయమైన పాత సామగ్రి

- పోలీసులు, అధికారులకు ఫిర్యాదు చేసిన కౌన్సిలర్లు
- విచారణ చేపట్టిన అధికారులు
- ఎత్తుకెళ్లిన సామగ్రి స్థానంలో తుక్కు పడేసిన వైనం

కామారెడ్డి టౌన్ : కామారెడ్డి బల్దియా ఆదాయానికి ఇంటి దొంగలు గండికొడుతున్నారు. మున్సిపాలిటీకి సంబంధించి పలుచోట్ల ఉన్న సుమారు రూ. 8 లక్షల విలువ చేసే పాత సామగ్రి(స్క్రాప్)ని ఎత్తుకెళ్లారు. దీనిపై కౌన్సిలర్లు అధికారులకు ఫిర్యాదు చేయడంతో గుట్టుచప్పుడు కాకుండా వేరే తుక్కును తీసుకువచ్చి పడేశారు. వివరాలిలా ఉన్నాయి.



బల్దియాకు చెందిన పాత సామగ్రిని లారీలో తరలిస్తున్న దృశ్యం

10వ తేదీన తరలింపు

పట్టణానికి నీటిని సరఫరా చేసే బుర్రమత్తడి, పెద్ద చెరువు వద్ద గది, వాటర్ వర్క్స్ కార్యాలయం, గడి ట్యాంక్, జాతీయ రహదారి పక్కన ఫిల్టర్ బెడ్ వద్ద చెడిపోయిన మోటార్లు, పైపులు, వైర్లు, తీగలు, భారీ వాల్స్, చేతి పంపులు, విద్యుత్ ఇనుప స్తంభాలు చాలా ఏళ్లుగా పేరుకుపోయాయి. వాటి విలువ రూ. 8 లక్షల వరకు ఉంటుందని అంచనా. దీనిపై కన్నేసిన బల్దియా ఉద్యోగి ఈనెల 10న రాత్రి సమయంలో కూలీలతో వచ్చి లారీలో సామగ్రి నింపి తీసుకువెళ్లారు. ఈ విషయం తెలియడంతో కౌన్సిలర్లు ఈనెల 15న కామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో, 16న బల్దియా కమిషనర్‌కు, 21న కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వీడియోలు, ఫొటోలను ఫిర్యాదుకు జత చేశారు. కౌన్సిలర్లు, నాయకులు షేరూ, ప్రసాద్, అంజాద్, నిట్టు కృష్ణమోహన్, ప్రముఖ, అపర్ణ వేరువేరుగా ఫిర్యాదులు ఇచ్చారు. బీజేపీ కౌన్సిలర్లు సైతం ఈ విషయమై ఆరా తీసి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో కమిషనర్ విచారణ చేపట్టాల్సిందిగా మున్సిపల్ డీఈ వేణుగోపాల్‌ను ఆదేశించారు. ఆయన శుక్రవారం విచారణ ప్రారంభించారు.



ప్రస్తుతం ఫిల్టర్ బెడ్ వద్దనున్న మున్సిపాలిటీకి సంబంధం లేని పాత సామగ్రి

పక్కా ప్లాన్‌తో..

పట్టణంలోని ఫిల్టర్ బెడ్ వద్ద విధులు నిర్వహిస్తున్న ఓ రెగ్యులర్ ఉద్యోగితో పాటు మరొక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిని చెరువు వద్దనున్న గది వద్దకు వెళ్లాలని ఓ అధికారి ఆదేశించినట్లు తెలిసిందే. వారు అటు వెళ్లగానే సదరు అధికారి లారీలో సామగ్రిని తరలించారని తెలుస్తోంది. విషయం వెలుగులోకి రావడంతో తిరిగి 18వ తేదీన సదరు అధికారే పాత ఇనుప సామగ్రిని తీసుకువచ్చి పడేశారని సమాచారం. ఈ వ్యవహారంలో మరికొందరి హస్తం కూడా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మున్సిపల్ సామగ్రిని దొంగలించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ కౌన్సిలర్లు ఆకుల సుజిత, నరేందర్, శ్రీనివాస్ డిమాండ్ చేశారు.

రూ. 8 లక్షల సామగ్రి ఎత్తుకెళ్లి..

బల్దియాకు సంబంధించిన పాత సామగ్రిని నిబంధనల ప్రకారం బహిరంగ వేలం ద్వారా విక్రయించి, వచ్చిన డబ్బులను బల్దియా ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. బల్దియాకు సంబంధించిన సామగ్రిని ఇంటిదొంగ లారీలో హైదరాబాద్ రూట్‌లో ఉన్న ఓ పాత ఇనుప సామగ్రి వ్యాపారికి రూ. 8 లక్షలకు విక్రయించినట్లు తెలిసింది. దీనిపై ఫిర్యాదులు రావడంతో అప్రమత్తమైన సదరు ఉద్యోగి.. ఈనెల 18న అర్ధరాత్రి పట్టణానికి చెందిన ఓ పాత ఇనుప సామగ్రి వ్యాపారి వద్ద నుంచి తుక్కును వ్యాన్‌లో తీసుకొచ్చి ఫిల్టర్ బెడ్ వద్ద పడేశారు. ఇందులో బల్దియాకు సంబంధం లేని రేకులు, జాలీలు, డబ్బాలు, పిల్లల సైకిళ్లు, చక్రాలు, తొట్టెలు తదితర సామగ్రి వేయడం గమనార్హం. వీటి విలువ సుమారు రూ. 20 వేలు కూడా ఉండదని తెలుస్తోంది.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

ఫిల్టర్ బెడ్ వద్దనున్న బల్దియాకు సంబంధించిన పాతసామగ్రి చోరీకి గురైందని కౌన్సిలర్లు ఫిర్యాదు చేశారు. దీనిపై డీఈతో విచారణ చేపట్టాం. విచారణ విషయం తెలియగానే ఎత్తుకెళ్లిన మున్సిపల్‌కు సంబంధించిన సామగ్రి స్థానంలో పాత ఇనుప సామాన్లు తెచ్చిపడేసినట్లు తెలిసింది. పూర్తి నివేదిక రాగానే ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– స్పందన, మున్సిపల్ కమిషనర్

కార్మిక సంఘం ఎన్నికల్లో బీఎంఎస్ గెలుపు

నిజాంసాగర్ : మాగి గాయత్రి చక్కెర కార్మాగారం కార్మిక సంఘం ఎన్నికల్లో భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) ఘన విజయం సాధించింది. శనివారం ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. 185 మంది కార్మికులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో బీఎంఎస్‌కు 93 ఓట్లు పోలవగా.. ఐఎన్‌టీయూసీకి 47 ఓట్లు, బీఆర్ఎస్ సంస్థకు 45 ఓట్లు వచ్చాయి. బీఎంఎస్ తన సమీప ప్రత్యర్థి ఐఎన్‌టీయూసీపై 46 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఆ సంఘం ప్రతినిధులు సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు మైపాల్, సాయిలు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



సంబురాలు చేసుకుంటున్న బీఎంఎస్ ప్రతినిధులు

బెంబేలెత్తిస్తున్న బైపాస్

- ప్రమాదకరంగా అంతర్‌రాష్ట్ర బైపాస్ రోడ్డు
- మూలమలుపుల వద్ద భారీ గుంతలు
- కానరాని హెచ్చరిక బోర్డులు

బోధన్: అంతర్‌రాష్ట్ర రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా కొత్తగా నిర్మించిన బైపాస్ బీటీ రోడ్డు అంచున వేసిన మొరం వర్షానికి కొట్టుకుపోయి అడుగడుగునా భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో బైపాస్ రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళల్లో రోడ్డు అంచున గుంతలు కనిపించక ద్విచక్రవాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. వాహనదారులు ఏమాత్రం అజాగ్రత్తగా రోడ్డు దిగితే ప్రాణాలకే ముప్పు ఏర్పడే పరిస్థితి ఉంది. ప్రాణాలు పోతేనే అధికారులు స్పందిస్తారా? అని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతర్‌రాష్ట్ర రోడ్డు విస్తరణ పనులు, నిర్వహణపై పర్యవేక్షణ కొరవడిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.35 కోట్లతో అంతర్‌రాష్ట్ర రోడ్డు విస్తరణ పనులు చేపట్టినట్లు అధికారులు ప్రారంభంలోనే వెల్లడించారు. ఈ రోడ్డు పనులతో తెలంగాణ – మహారాష్ట్ర మధ్య రవాణా మరింత సౌలభ్యంగా మారినప్పటికీ రోడ్డు పక్కన ఏర్పడిన గుంతలను పూడ్చివేయాల్సిన అవసరం ఉంది.

బోధన్ పట్టణ శివారు నుంచి మహారాష్ట్ర ప్రాంతంలోని 63వ జాతీయ రహదారికి అనుసంధానంగా నాగన్‌పల్లి, సాలూర క్యాంప్, సాలూర గ్రామాల మీదుగా సాలూర అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టు వరకు 8.3 కిలో మీటర్ల పొడువునా నాలుగు వరుసల రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. పాత బీటీ రోడ్డు విస్తరణతోపాటు మూడు గ్రామాల శివారులోని పంట పొలాల మధ్యలో సుమారు 4 కిలో మీటర్ల పొడువునా కొత్తగా బైపాస్ రోడ్డు నిర్మించారు. నాగన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న పసుపు వాగుపై కొత్తగా చేపట్టిన భారీ వంతెన నిర్మాణ పనులు ఆఖరి దశకు చేరగా, కొంత కాలంగా పనులు నిలిచిపోయాయి. పనులను కాంట్రాక్టర్ అప్పగించగా, నేషనల్ హైవే అథారిటీ పర్యవేక్షిస్తోంది.



సాలూర క్యాంప్ వద్ద పాత బీటీ రోడ్డు మూల మలుపు వద్ద సైడ్‌వాల్ లేని కల్వర్టు, పక్కనే భారీ గుంత



కొప్పర్తి గ్రామ క్రాసింగ్ వద్ద సైడ్‌వాల్‌లేని కల్వర్టు, పక్కనే లోతైన గుంత



నాగన్‌పల్లి గ్రామ శివారులోని పసుపు వాగుపై కొత్తగా నిర్మించిన వంతెన

పొంచి ఉన్న ప్రమాదాలు

ఏడాది క్రితం నుంచి బైపాస్ రోడ్డు మీదుగా ప్రతిరోజూ వందల సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. బోధన్, సాలూర మండలాల పరిధిలోని సుమారు 20 గ్రామాల ప్రజలు బోధన్‌కు ఇదే రోడ్డు మీదుగా వెళ్తున్నారు. సాలూర క్యాంప్, నాగన్‌పల్లి, సాలూర గ్రామాల మధ్య బైపాస్ రోడ్డులో పంట పొలాల మధ్య సాగు నీటి పారకం కోసం నిర్మించిన కల్వర్టు సైడ్‌వాల్స్ రోడ్డు అభివృద్ధి క్రమంలో మట్టిలో కూరుకుపోయాయి. కల్వర్టుల వద్ద ఇరువైపులా భారీ గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయి. బైపాస్ రోడ్డుకు లింకేజీగా ఉన్న పాత బీటీ రోడ్డు మూలమలుపుల వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. భారీ గుంతల వద్ద కనీసం ప్రమాద సూచిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదు. నేషనల్ హైవే ఈఈ కాంతారావును బైపాస్ రోడ్డు పరిస్థితిపై వివరణ కోరగా.. అంతర్‌రాష్ట్ర బైపాస్ రోడ్డు అంచున గుంతలు, కల్వర్టుల పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

“ అధికారులు స్పందించాలి



సాలూర, సాలూర క్యాంప్, నాగన్‌పల్లి గ్రామాల శివారులో పాత బీటీ రోడ్డు మూల మలుపులు, కల్వర్టుల వద్ద ఏర్పడిన భారీ గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. రోడ్డు అంచుల్లో మొరం కొట్టుకుపోయి గుంతలు ఏర్పడి వాహనదారులు రోజూ ప్రమాదాలబారిన పడుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి. కనీసం భారీ గుంతల వద్ద ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి.

– ఆర్ సురేశ్, సాలూర గ్రామస్తుడు

క్లుప్తంగా

రాత పరీక్ష లేకుండా క్రమబద్ధీకరించాలి



కామారెడ్డి టౌన్: వైద్య శాఖలో కాన్ట్రాక్ట్‌గా విధులు నిర్వహిస్తున్న తమకు ఎలాంటి రాత పరీక్ష లేకుండా క్రమబద్ధీకరణ చేయాలని కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రాస్తారోకో చేపట్టారు. జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వైద్య శాఖలో గత 23 ఏళ్లుగా పనిచేస్తున్న తమను పరీక్ష రాసిన తర్వాతనే రెగ్యులర్ చేస్తామని చెప్పడం సిగ్గుచేటని ప్రభుత్వంపై మండిపడ్డారు. వెంటనే సమస్యలను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. నాయకులు కొత్త నర్సింలు, కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలు దీవెన, కవిత, ఆసియా, సంధ్యారాణి, స్వరూప, రేణుక, జోష్ణ దేవి, మౌనిక, విజయ, గంగమణి, ఫ్లారెన్స్, బాలమణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



గాంధారి(ఎల్లారెడ్డి): ప్రతి విద్యార్థిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పరీక్షల్లో ఒత్తిడికి గురికాకుండ తగిన సలహాలు ఇవ్వాలని ఉపాధ్యాయులకు ఇంటర్మీడియెట్ నోడల్‌అధికారి షేక్‌సలాం సూచించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా షేక్‌సలాం మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ఇంటర్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. అధ్యాపకులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు పలు సూచనలు చేశారు. సకాలంలో సెలబస్ పూర్తి చేయాలన్నారు. ప్రిన్సిపాల్ గంగారాం అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి

- రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, పోచారం శ్రీనివాస్‌రెడ్డి



బాన్సువాడలో కేక్ కట్ చేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ: రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తోందని వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాన్సువాడలోని మీనా గార్డెన్స్‌లో శనివారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్, సబ్‌కలెక్టర్ కిరణ్మయిలతో కలిసి ఆయన హాజరయ్యారు. క్రిస్మస్ కేక్ కట్ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం క్రిస్మస్ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తుందని, ప్రభుత్వం అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తుందని అన్నారు. పండుగలు వేరైనా అన్ని మతాల సారాంశం ఒక్కటేనని అన్నారు. ప్రభుత్వం తరపున వచ్చిన క్రిస్మస్ దుస్తువులను పేద క్రిస్టియన్లకు అందజేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు క్రిస్టియన్లు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, తహసీల్దార్ వరప్రసాద్, చర్చిల పాస్టర్లు జ్ఞానేందర్, ఇమ్మానియల్, ప్రశాంత్, తార, రిఘన్ తదితరులు ఉన్నారు.

కేంద్ర మంత్రివర్గం నుంచి అమిత్‌షాను తొలగించాలి



బాన్సువాడలో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్



నస్రుల్లాబాద్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంబేడ్కర్ సంఘ సభ్యులు



బిచ్కుందలో..

సాక్షి నెట్‌వర్క్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని దళిత సంఘాల సభ్యులు, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం జిల్లాలోని పలు మండలాల్లో అమిత్‌షా దిష్టిబొమ్మను వారు దహనం చేశారు. అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అంబేడ్కర్‌ను అమిత్‌షా అవమానించారని, వెంటనే ఆయన దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాన్సువాడలో అంబేడ్కర్ విగ్రహానికి ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ క్షీరాభిషేకం నిర్వహించారు. కామారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాగయ్య, జిల్లా అధ్యక్షుడు చిట్యాల సాయన్న మాట్లాడారు. అమిత్‌షా వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.





కామారెడ్డిలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు.. బ్రాహ్మణపల్లిలో నిరసన తెలుపుతున్న నేతలు

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



సమ్మెలో కూర్చున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

కామారెడ్డి టౌన్: తమ డిమాండ్‌లను పరిష్కరించాలని కోరుతూ జిల్లాకేంద్రంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజు కొనసాగింది. ఈసందర్భంగా మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉన్న సమ్మె శిబిరంలో ఆటపాటలతో ఉద్యోగులు నిరసన తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి తమకు హామీ ఇచ్చి యేడాది దాటిన ఇప్పటి వరకు స్పందించకపోవడం బాధకరమన్నారు. ఇప్పటికైనా తక్షణమే తమను క్రమబద్ధీకరణ చేసి, పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంపత్, వాసంతి, రాములు, సంతోష్‌రెడ్డి, శైలజ, దామోదర్, వీణ, సాయిలు, లావణ్య పాల్గొన్నారు.

మూతపడిన భవిత సెంటర్లు



కామారెడ్డిలో తెరుచుకోని భవిత కేంద్రం

కామారెడ్డి రూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెతో జిల్లాలోని భవిత సెంటర్లు మూతపడ్డాయి. జిల్లావ్యాప్తంగా మండలానికి ఒక భవిత సెంటర్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో దివ్యాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీ చేస్తారు. సమగ్ర శిక్షా ఉద్యోగులే ఇందులో ఐఆర్పీలుగా పని చేస్తుంటారు. కానీ గత 12 రోజులుగా ఐఆర్పీలు సమ్మెలో ఉండడంతో భవిత కేంద్రాలు మూసిఉన్నాయి. దీంతో ఫిజియోథెరపీ చికిత్స చేయడం లేదు. ప్రభుత్వం ఉద్యోగుల సమ్మె విరమింపజేసి భవిత కేంద్రాలు పునఃప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని దివ్యాం విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

చికిత్స పొందుతూ తాపిమేస్త్రి మృతి

నిజామాబాద్ రూరల్: గోడ పైనుంచి పడిన ఘటనలో తీవ్రగాయాలపాలైన తాపిమేస్త్రి పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన రూరల్‌పోలీస్ స్టేషన్ పరిధిలోని గుపన్‌పల్లిలో చోటు చేసుకుంది. రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లాకు చెందిన బత్తుల శ్రీను గూపన్‌పల్లిలో ఉంటూ మేస్త్రి పనులు చేస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం రోజున పనికి వెళ్లిన శ్రీను గోడ నిర్మిస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి తలకు బలమైన గాయాలయ్యాయి. శీనును ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి భార్య భక్తుల ధనలక్ష్మి ఆంధ్ర నుంచి రావడం ఆలస్యం కావడంతో శనివారం ఉదయం పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కటుంబీలకు అప్పగించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి ..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పరిధిలోని నిజామాబాద్ రైల్వే స్టేషన్ వద్ద మురికికాలువలో పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై మొగులయ్య శనివారం తెలిపారు. మృతుడి వయస్సు 55 నుంచి 60 సంవత్సరాలు ఉంటుందని, పసుపు రంగు షర్ట్, బ్లూ కలర్ ప్యాంట్, బ్లాక్ కలర్ స్వెటర్ ఉందని వివరించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

పరిస్థితి విషమించి ..



గోండ్ల శంకర్(ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : విద్యుత్‌షాక్‌కు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గోండ్ల శంకర్(36) పరిస్థితి విషమించి శనివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఈ నెల 6వ తేదీన పొలం వద్ద విద్యుత్ షాక్‌కు గురైన శంకర్‌ను నిజామాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. కుడిచేయి, మెడ, ఛాతి భాగం కాలిపోవడంతో పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య



కావేరి మృతదేహం

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని నల్లమడుగు పెద్దతండాకు చెందిన ధనావత్ కావేరి(26) అనే వివాహిత శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. కావేరి భర్త ట్రాక్టర్ బోల్తాపడి ఆరు నెలల క్రితం మృతి చెందగా, పిల్లలు ఆదిత్య, శ్రీవిఘ్నేష్‌తో కలిసి ఉంటోంది. శనివారం ఉదయం ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అయితే తన కూతురి మరణంపై అనుమానం ఉందని కావేరి తండ్రి కిషన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

హోటల్‌లో మద్యం పట్టివేత



కామారెడ్డి క్రైం: నిబంధనలకు విరుద్ధంగా మద్యం సిట్టింగ్ నిర్వహిస్తున్న ఓ హోటల్‌పై ఎక్సైజ్ పోలీసులు కేసు నమోదు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పట్టణంలోని విజయదుర్గా భవానీ హోటల్‌లో తనిఖీలు చేశారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని హోటల్ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

రెండు ట్రాక్టర్లు సీజ్

మాక్లూర్: మండలంలోని బోర్గాం(కె) శివారులో పూలాంగ్ వంతెన కింద నుంచి మట్టి తరలిస్తున్న రెండు ట్రాక్టర్లతోపాటు జేసీబీని శనివారం పట్టుకున్నట్లు ఆర్ఐ షఫీ తెలిపారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక బృందం



రుద్రూర్: పోతంగల్ మండలంలోని మంజీరా పరీవాహక ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసులతో కలిపి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం ప్రతి రోజూ రాత్రి 9 గంటల నుంచి ఉదయం ఆరు గంటల వరకు నది పరీవాహక ప్రాంతాల్లో పర్యటించనుంది. ఇసుక అక్రమరవాణా చేసే వాహనాలను బృందం సభ్యులు పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలిస్తారని తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. పట్టుబడ్డ వాహన యాజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో స్పెషల్ డ్రైవ్



ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏసీపీ రాజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో తనిఖీలు నిర్వహించారు. అనుమానాస్పదంగా ఉన్న 18 ద్విచక్ర వాహనాలతోపాటు ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. స్పెషల్ డ్రైవ్‌లో ఎఎస్‌హెచ్‌వో రఘుపతి, సీసీఎస్ సీఐ వీరయ్య, ఎస్సై మొగిలయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాటస్థావరంపై దాడి

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం హాసాకొత్తూర్‌లో శుక్రవారం అర్ధరాత్రి పేకాటస్థావరంపై దాడి చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.8,150 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మల్లూర్‌లో నలుగురి పట్టివేత

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని మల్లూర్ గ్రామ శివారులో ఉన్న శ్మశాన వాటికలో పేకాట ఆడుతున్న నలుగురిని శనివారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.11,540 నగదు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కొండాపూర్‌లో..

సిరికొండ: మండలంలోని కొండాపూర్ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎల్ రామ్ తెలిపారు. పట్టుబడిన వారి నుంచి రూ.2420 నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

ఒకరి అదృశ్యం

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి చెందిన కటికె కపిల్(28) అదృశ్యమైనట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. ఈనెల 18న నుంచి తన భర్త కనిపించడం లేదని కపిల్ భార్య లావణ్య ఫిర్యాదుచేసిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రేపు చలో కలెక్టరేట్ ముట్టడి



కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 23న చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వనమాల కృష్ణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని బీడీ కార్మికులు కలెక్టరేట్ ముట్టడికి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. నాయకు లు వెంకట్, రాజేశ్వర్, కిషన్ తదితరులు ఉన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



కామారెడ్డి టౌన్: తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సాంకేతిక సహాయకుల యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శనివారం డీఆర్‌డీవో సురేందర్‌కు వినతిపత్రం అందజేశారు. యూనియన్ అధ్యక్షుడు కృష్ణాగౌడ్ గంగాధర్, నాయకులు శ్రీనివాస్, ఆమర్, ముజీబ్, జగదీశ్వర్‌రెడ్డి, రాజు, రమేష్ ఉన్నారు.

భజన మండలికి కార్డులెస్ మౌత్ పీస్ బహూకరణ

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలోని భజన మండలికి శనివారం తక్కళ్ల నిరంజన్ రెడ్డి రూ.12వేలు వెచ్చించి కార్డులెస్ మౌత్‌పీస్‌ను అందజేశారు. వీడీసీ మాజీ అధ్యక్షుడు తక్కళ్ల నర్సరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు తక్కళ్ల రవీందర్‌రెడ్డి, నాయకుడు రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

కమ్మేసిన మంచు దుప్పటి



బీబీపేట: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలల్లో శనివారం ఉదయం మంచు దుప్పటి కమ్మేసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం 10గంటల వరకు దట్టమైన పొగమంచు ఉండటంతో వాహనదారులకు రోడ్డు కనిపించక లైట్లు వేసుకొని వెళ్లారు. పడ్డారు. గ్రామాల్లో పొగమంచు కారణంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురయ్యారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



సమద్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని గోపాల్‌పేట మోడల్ స్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు సీఎంకప్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాంప్రసాద్, పీడీ ప్రవీణ్ తెలిపారు. కామారెడ్డిలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలలో విద్యార్థులు సయిద్, సమద్ పాల్గొని ఉత్తమ ప్రతిభ చూపారన్నారు. ఈసందర్భంగా వారిని ఉపాధ్యాయులు,గ్రామస్తులు అభినందించారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్ట్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌కు చెందిన దాసరి రాజు అనే యువకుడిని పోక్సో కేసులో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ శ్రీనివాసులు తెలిపారు. నాగిరెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఆయన కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ నెల 5వ తేదీన మండలంలోని ఓ మైనర్‌బాలికను రాజు తన బైక్‌పై ఎక్కించుకొని హైదబాద్‌లోని షాపూర్‌కు తీసుకెళ్లి ఓ గదిలో ఉంచాడు. తమ కూతురు కనిపించడం లేదని బాలిక తల్లిదండ్రులు అదే రోజున పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టిన విషయం తెలుసుకున్న రాజు బాలికను శనివారం మండలకేంద్రంలోని గోపాల్‌పేటలో వదిలి వెళ్లిపోతుండగా పట్టుకున్నారు. రాజును అరెస్టు చేయడంతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. రాజును రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో ఎస్సై మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళను వేధించిన యువకుడిపై కేసు

రుద్రూర్: స్నేహితుడి భార్యను వేధించిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు తన స్నేహితుడి భార్యకు కొద్ది రోజులుగా ఫోన్‌లో మెస్సేజ్‌లు చేస్తున్నాడు. అవతలి వ్యక్తి ఎవరు అనేది తెలియక మహిళతోపాటు ఆమె భర్త కొద్ది రోజులుగా ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలో మహిళ తన తల్లిగారింటికి వెళ్లిపోయింది. అయినప్పటికీ మెస్సేజ్‌లు వస్తుండడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిఘా పెంచిన మహిళ కుటుంబ సభ్యులు మెస్సేజ్‌లు చేస్తున్న వ్యక్తి మద్నూర్‌లో ఉన్నట్లు గుర్తించి అక్కడికి వెళ్లారు. సదరు మహిళ భర్త స్నేహితుడే మెస్సేజ్‌లు చేస్తున్నట్లు గుర్తించి అతడికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంట్లో నిప్పంటించిన వ్యక్తి అరెస్ట్

ఖలీల్‌వాడి: భార్యపై కోపంతో అత్తవారింట్లో పెట్రోల్ పోసి నిప్పంటించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మూడో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై హరిబాబు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని సుభాష్‌నగర్ చెందిన శ్రీరామ్ గాయత్రికి మహారాష్ట్రలోని బోకర్‌కు చెందిన రమేశ్‌తో 2017లో వివాహమైంది. గొడవలు కావడంతో భర్తపై గాయత్రి మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ రమేశ్ తన పద్ధతి మార్చుకోకుండా బంగారం ఇవ్వాలని వేధించడంతో 20 రోజుల క్రితం గాయత్రి తన తల్లిగారింటికి వచ్చేసింది. దీంతో తన భార్యతోపాటు ఆమె కుటుంబ సభ్యులను చంపాలనే ఉద్దేశంతో రమేశ్ ఈనెల 19న ఉదయం 9.30 గంటలకు పెట్రోల్ తీసుకుని వచ్చి గాయత్రి ఇంట్లో పోసి నిప్పంటించి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు. గాయత్రి ఫిర్యాదు మేరకు ఆమె భర్త రమేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.